

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : పిసిపిఎన్‌డిటి-96 నిబంధనలు అతిక్రమించే ఆస్పత్రులపై చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రతి స్కాన్ సెంటర్ తప్పక నమోదై ఉండాలన్నారు. ఇచ్చిన నిర్ణీత తేదీకి రెన్యువల్ చేయించుకుని పిసిపిఎన్‌డిటి వెబ్‌సైట్‌లో స్కాన్ చేసిన ప్రతి గర్భిణి వివరాలను నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలో ఉండే ఫారం-ఎఫ్ రిజిస్టర్‌ను ప్రతి స్కాన్ సెంటర్ నిర్వహించాలని సూచించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తొలిసారి వచ్చే ఫిర్యాదులకు నోటీసులు ఇస్తామని, రెండోసారి అదే తప్పు కొనసాగితే రూ.25 వేల అపరాధరుసుము వసూలు చేస్తామన్నారు. మూడోసారి అదే తప్పు చేస్తే ఆస్పత్రి సీజ్ చేయడంతో పాటు డాక్టర్ రిజిస్ట్రేసన్ రద్దు చేస్తామని తెలిపారు.

ఊరంతా సంక్రాంతి

- పట్టణాలు, గ్రామాల్లో పండగ హడావుడి
- సందడి చేస్తున్న కళాకారులు
- పల్లెబాట పట్టిన పట్టణవాసులు
- కళకళలాడుతున్న మార్కెట్లు
- రద్దీగా మారిన రోడ్లు
- ప్రయాణాలకు తప్పని తిప్పలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం

తెలుగు వారు ఘనంగా చేసుకునే ముఖ్యమైన పండుగల్లో ఒకటైన సంక్రాంతి రానే వచ్చింది. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా పెద్ద పండుగను అన్ని తరగతుల ప్రజలు కుటుంబాలతో కలిసి చేసుకోవడంతో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తోంది. దూర ప్రాంతాల్లో నివసించే వారు స్వస్థలాలకు చేరుకున్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లో పండగ సందడి పతాకస్థాయికి చేరింది.

సంక్రాంతి పండగకు ఎక్కడెక్కడో ఉన్న వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో సంక్రాంతికి శోభను తీసుకొచ్చే హరిదాసులు, గంగిరెద్దులు, చెంచులు, బుడగజంగాలు, డప్పు వాయిద్య కళాకారులు హడావుడి చేస్తున్నారు. జానపద కళాకారుల ఆటపాటలు సంక్రాంతికి మరింత వన్నె తెచ్చి పెట్టింది. నిరుపేదలకు పలువురు దాతలు వ్యక్తిగతంగానే కాకుండా సంస్థలు, సంక్షేమ సంఘాల తరపున వస్త్ర దానాలు వంటి కార్యక్రమాలను కూడా పండగ సందర్భంగా నిర్వహిస్తున్నారు.

కిటకిటలాడిన మార్కెట్లు, వస్త్ర దుకాణాలు

వస్త్ర దుకాణాలు పండగ కళను సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో కిటకిట లాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని జి.టి రోడ్డు, పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డులో జన సందడి నెలకొంది. చిన్నారుల నుంచి పెద్దల వరకూ వస్త్రాల కొనుగోలుకు క్యూ కడుతున్నారు. వినియోగదారుల అభిరుచులకు తగ్గట్లుగా వస్త్ర వ్యాపారులు రకరకాల డిజైన్లను అందుబాటులోకి తెచ్చారు.

వస్త్ర వ్యాపారులు అక్టోబరు నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కొనుగోలు చేసేందుకు వెళ్లడం ప్రారంభిస్తారు. నవంబరు నెలాఖరు నాటికి పలురకాల వస్త్రాలను తెప్పిస్తారు. శ్రీకాకుళం నగరంలో చిన్నాపెద్దా అన్నీ కలిపి 200కు పైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఆన్‌లైన్ వస్త్ర వ్యాపారం కూడా విస్తృతంగా నడుస్తోంది. జిల్లా నలుమూల నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది క్రిస్మస్ నుంచి ఈ వ్యాపారం ఊపందుకుంది. సంక్రాంతి వరకూ వస్త్ర దుకాణాలన్నీ బిజీగా ఉంటాయి.

టిక్కెట్ల కోసం థియేటర్ల వద్ద పడిగాపులు

ఇదే సందర్భంలో వరుసగా కొత్త సినిమాలు విడుదల కావడంతో వాటికి డిమాండ్ నెలకొంది. టిక్కెట్ల కోసం థియేటర్ల చుట్టూ జనం ప్రదక్షిణలు చేస్తున్నారు. పండగ రోజుల్లో ఇంటిల్లిపాదీ సినిమాలు తిలకించేందుకు టిక్కెట్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకుని వాటిని తిలకించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

గ్రామాల బాట పట్టిన వలసవాసులు

ఉపాధి కోసం వలసలు వెళ్ళిన వారంతా సంక్రాంతి నేపథ్యంలో తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇప్పటికే కొందరు స్వస్థలాలకు చేరుకోగా, మరికొందరు పండగ నేపథ్యంలో వస్తూనే ఉన్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లిపోయి అక్కడ పనులు చేసుకుంటున్నారు. అలా వెళ్ళిన వారంతా కుటుంబాలతో కలిసి సొంత గ్రామాలకు చేరుకుంటున్నారు. పండగ నేపథ్యంలో బస్సులు, రైళ్లు అన్నీ రద్దీగా మారిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోవడం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సొంత వాహనాలపైనే ఎక్కువగా ప్రయాణాలను సాగించేందుకే ఎక్కువగా ప్రజలు మొగ్గుచూపుతున్నారు.



కిటకిటలాడుతున్న పొట్టిశ్రీరాములు మార్కెట్



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గాజుల కొల్లివలస పరిధిలోని సంగమయ్య కొండ దిగువన సైకత శిల్పి గేదెల హరికృష్ణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

- ప్రజాశక్తి, ఆమదాలవలస



శ్రీకాకుళం అర్బన్ : భోగి మంటల్లో జిఓ ప్రతులను వేస్తున్న నాయకులు

భోగి మంటల్లో ఎస్మా జిఒ ప్రతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, పొందూరు, కోటబొమ్మాళి

అంగన్వాడీల వేతనాలు వెంటనే పెంచాలని, ఎస్మాను ప్రయోగిస్తూ జారీ చేసిన జిఒ నంబరు 2ను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 34వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా జ్యోతిరావు పూలే పార్కు వద్ద సమ్మె శిబిరంలో భోగి మంటలు వేసి జిఒ నంబరు 2 ప్రతులను దగ్ధం చేశారు. శిబిరం వద్ద అంగన్వాడీల కుటుంబసభ్యులు, లబ్ధిదారులతో కలిసి పిల్లలకు భోగి పళ్లు వేసి వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ఎన్ని నిర్బంధాలు విధించినా, అంతకు రెట్టించిన ఉత్సాహంతో పోరాటం కొనసాగిస్తారని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా 1.10 లక్షల మంది అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొండివైఖరి వీడకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీల సంక్షేమం కోసం గ్రాట్యుటీని అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు, నోటీసులు ఇవ్వడం మానుకోవాలని, తక్షణమే న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచి వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వ నిర్బంధాలు, అరెస్టులు, కేసులకు భయపడేది లేదన్నారు. నిరవధిక నిరాహార దీక్షకైనా వెనకాడేది లేదని తెలిపారు. అంగన్వాడీలకు గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత, నాయకులు ఎం.నాగరత్నం, కె.విజయలక్ష్మి, కె.జ్యోతి, ఎస్.చిట్టితల్లి, ఎల్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పొందూరు మండలం లోలుగులో జగనన్నకు చెబుదాం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, జి.భారతి, సిహెచ్.సూర్యకళ, కె.చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన అంగన్వాడీ సిబ్బంది గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



పొందూరు : సంతకాల సేకరణ చేపడుతున్న అంగన్వాడీలు



టిడిపి కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలు

చేతకాని ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

నాలుగున్నరేళ్లుగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసిపి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయ అవరణలో ఆదివారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. భోగి మంట వేసి, అందులో భూహక్కు చట్టం, అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 2 ప్రతులను వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా... వాటి అమలు కోసం ప్రశ్నించే, పోరాడే వారిపై కేసులు బనాయించడం, ఎస్మా ప్రయోగించడం వంటి అణచివేత చర్యలకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలు ఆందోళనబాట పడుతూ తిరుగుబాటు చేస్తున్నారని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారని, అందుకే పార్టీని నమ్ముకున్న సొంత ఎమ్మెల్యేలు సైతం తలోదారి పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి ఇదే చివరి సంక్రాంతి అవుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, బగాది శేషు, జీరు భీమారావు, పినకాన అజయ్‌కుమార్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షులు పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

శ్రీకాకుళం : సంక్రాంతి పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు, సొంత గ్రామాలపై మమకారానికి, రైతులకు, వ్యవసాయానికి మనమంతా ఇచ్చే గౌరవానికి, ప్రత్యేక కళలకు సంక్రాంతి పండగ ప్రతీక అని తెలిపారు. భోగి మంటలు, రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలిపటాల సందళ్లు, పైరు పచ్చల కళకళలు గ్రామాల్లో సంక్రాంతి శోభను తీసుకువస్తాయని పేర్కొన్నారు. సంక్రాంతి, కనుమ పండుగలను ప్రతి కుటుంబం సంతోషంగా చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖ సౌఖ్యాలు, భోగ భాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.



దగ్ధమవుతున్న ధాన్యం బస్తాలు

20 ధాన్యం బస్తాలు దగ్ధం

పలాస : పలాస పెద్దవీధికి చెందిన తెలుకుల రాసమ్మకు చెందిన 20 బస్తాల ధాన్యం ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. పలాస సీతమ్మగుడి సమీపంలో రాసమ్మకు చెందిన రెండెకరాల పొలం ఉంది. పండించిన ధాన్యాన్ని పొలంలో ఉంచగా, ఒక్కసారిగా ధాన్యం బస్తాలు కాలిపోవడంతో స్థానికులు రాసమ్మకు సమాచారం అందించారు. మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా, కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పలాస అగ్నిమాపక సిబ్బంది శంకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేలు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు
- జిల్లా పంచాయతీ అధికారి బి.రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బి.రవికుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగానే తడి, పొడి చెత్త సేకరణ, నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీ, ప్లాస్టిక్ వాడకాన్ని తగించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.





గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తడి, పొడి చెత్త సేకరణకు పెద్దఎత్తున చర్యలు చేపట్టింది. ఈ చెత్త తొలగింపు వల్ల గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి వీలవుతుంది.

సేకరించిన చెత్త నిల్వ చేసుకునేందుకు, వాటి నుంచి సంపద తయారీకి అనువుగా వర్మీ కంపోస్టు తయారీ జరుగుతోంది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం శతశాతం కావడం వల్ల గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయి.

వర్మీ కంపోస్టు తయారీకి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఇళ్ల నుంచి సేకరిస్తున్న చెత్తను ఆయా గ్రామాల్లో వర్మీ కంపోస్టు తయారీకి అనువుగా ఉపాధి హామీ నిధులతో షెడ్లను నిర్మించాం. ఇంకొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. గ్రామ సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ జరుగుతోంది. వర్మీ కంపోస్టు తయారీ ద్వారా తిరిగి ఆదాయ వనరులు సమకూర్చుకోవడం జరుగుతోంది.

వేసవిలో నీటిఎద్దడి నివారణకు తీసుకునే ప్రణాళికలు ఏమిటి?

వేసవిలో నీటిఎద్దడి తలెత్తే పరిస్థితి లేకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందిస్తున్నాం. గ్రామ పంచాయతీల పరిధిలో ఆర్థిక సంఘం నిధులతో బోర్లు మరమ్మతులు చేపట్టనున్నాం. ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలోని రక్షిత మంచినీటి పథకాల నిర్వహణతో పాటు ఎక్కడైనా మరమ్మతులకు గురైతే తక్షణమే బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు వల్ల సురక్షితమైన తాగునీరు అందించేందుకు వీలుంది.

పంచాయతీలకు నిధుల లభ్యత ఎలా ఉంది?

ఆర్థిక సంఘం నిధులు ఆయా గ్రామ పంచాయతీల ఖాతాలకు జమ అయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీలకు పారితోషిక నిధులు, పన్నులు, ఇతర సెస్‌ల రూపంలో వసూలవుతున్న నిధులు ఉన్నాయి. వాటిని వినియోగించుకునేందుకు వీలు కల్పించడమైంది. గ్రామ పంచాయతీల నిధుల నుంచి నిర్వహణ వ్యయానికి, సిబ్బంది వేతనాలు ఖర్చు చేసుకోవచ్చు.

భోగికి దూరంగా పలు గ్రామాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం / నౌపడ / పలాస

తెలుగువారికి పెద్ద పండగ సంక్రాంతి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇంటికి తీసుకొచ్చే సమయంలో నాలుగు రోజుల పాటు సంక్రాంతి పండగను జరుపుకోవడం సంప్రదాయంలా వస్తోంది. వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగలను నాలుగు రోజుల పాటు కుటుంబ సభ్యులతో సందడిగా జరుపుకుంటారు. వృత్తి, వ్యాపారులు, బతుకుతెరువు నిమిత్తం పలు ప్రాంతాల్లో ఎక్కడెక్కడో ఉన్నా సంక్రాంతి పండగకు రాని వారంటూ ఉండరు. అలాంటి మధురానుభూతులకు ఆలవాలమైన భోగి మంట వేడుకలకు కొన్ని గ్రామాలు తరతరాలుగా దూరంగా ఉంటున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో భోగి పండగను చేసుకోని గ్రామాలు ఇంచుమించు ఉండవు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తెల్లవారుజామునే ఆవుపేడతో ప్రత్యేకంగా చేసిన భోగి పిడకలతో గ్రామంలోని ఓ ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేసిన భోగి మంటల వద్దకు చేరి సందడిగా గడుపుతారు. పిల్లల విషయానికొస్తే ఆ ముచ్చటే వేరు. వారి ఆనందాన్ని వర్ణించలేం. అయితే నరసన్నపేట మండలంలో పలు గ్రామాల ప్రజలు భోగి పండగే తెలియదు. భోగి మంటలు వేయరు.

ఆ గ్రామాల్లో...

నరసన్నపేట మండలం బాలసీమ పంచాయతీ బసివలస, ఉర్లాం పంచాయతీ చింతువానిపేట, వివిఎన్‌పురం పంచాయతీ గోకయ్యవలస, చోడవరం, సుందరాపురం గ్రామాల ప్రజలకు భోగి పండగ అంటే ఏమిటో తెలియదు. బసివలసలో వందేళ్ల కిందట జరిగిన ఘర్షణ నేపథ్యంలో భోగిపండగ నిషేధించామని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ముక్కనుమ పండగ రోజు జరిగే కొమ్ముల (ఆవులను పూజించే) పండగ కూడా జరుపుకోరు. చింతువానిపేటలో కూడా భోగి పండగను జరుపుకోరు. కారణం ఏమిటన్నది ఎవరికీ తెలియదు. వివిఎన్‌పురం పంచాయతీ గోకయ్యవలసలోనూ భోగి పండుగ జరుపుకోరు. భోగిమంటలు వెలిగించరు. వందేళ్ల కిందట ప్రమాదవశాత్తూ భోగి మంటల్లో పిల్లి పడి మృతి చెందిందని, ఆ ఘటన అపశకునంగా భావించి భోగి వేడుకలు జరుపుకోమని గ్రామానికి చెందిన వృద్ధులు చెబుతున్నారు.



ఆ గ్రామాలదీ అదే దారి

సంతబొమ్మాళి మండలంలో యమాలపేట, చెట్లతాండ్ర, నౌపడ పంచాయతీలోని పాలనాయుడుపేటలోనూ భోగి పండగ చేసుకోరు. భోగి మంటలు వేస్తే ఆ గ్రామాల్లో ఏదో ఒక వింత అనుభవాలు ఎదురవుతుందన్న ప్రచారం బాగా ఉంది. యామాలపేటలో పూర్వీకులు ఒకసారి భోగి మంట వేస్తే, గ్రామంలోని పూరిపాకలు అంటుకుని భారీ అగ్ని ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు చెప్తున్నారు. అప్పట్నుంచి ఆ గ్రామంలో భోగి మంటలు వేయడం ఆపేశారు. దాన్నే నేటికీ కొనసాగిస్తున్నారు. చెట్లతాండ్రలో పూర్వం భోగి మంటలు వెలిగిస్తే, దాని నుంచి వచ్చిన పొగ గ్రామ సమీపంలోని కొండ పైకి వెళ్లేది. ఆ పొగతో కొండపై ఉన్న పులి భయపడి గ్రామంలోకి చొరబడేదన్న ప్రచారం ఉంది. దీంతో గ్రామంలో భోగి మంట వేయడం మానేశారు. నౌపడ పంచాయతీ పాలనాయుడుపేటలో భోగి మంట వేస్తే ఆ రోజు ఎవరో ఒకరు చనిపోతున్నారని భోగి మంటకు దూరంగా ఉన్నారు. ఇవి అప్పట్లో యాదృచ్ఛికంగా జరిగినా, అనాదిగా వస్తున్న ఆచారాన్ని ప్రస్తుత తరం కొనసాగిస్తోంది.

లక్ష్మీపురంలోనూ అదే పరిస్థితి

పలాస మండలం లక్ష్మీపురం గ్రామం కూడా కొద్ది సంవత్సరాలుగా భోగి పండగకు దూరంగా ఉంటోంది. కొన్ని సంవత్సరాల క్రితం గ్రామంలో భోగి మంటలు వేస్తుండగా ఎక్కడ నుంచో వచ్చిన జంతువు మంటలో పడిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్తున్నారు. అప్పట్నుంచి ఆ గ్రామంలో భోగి మంటలు ఆపేశారు.



జిఒ కాపీలను దహనం చేస్తున్న న్యాయవాదులు

భూ హక్కు చట్టం ప్రతుల దహనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎటువంటి చర్చ లేకుండా ఏకపక్ష నిర్ణయంతో అర్ధరాత్రి ఉత్తర్వులతో ఎవ్వరి కంట పడకుండా తీసుకొచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల నెత్తిన గుదిబండలా తీసుకొచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం భోగి పండగ పర్వదినాన 'చెడు నశించి మంచి కావాలనే తలంపుతో' ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో ఆధ్వర్యాన న్యాయవాదులు ప్రభుత్వ ఉత్తర్వు కాపీని భోగి మంటల్లో వేసి కాల్చి నిరసన తెలిపారు. పెత్తందారులకు అండగా, రాజకీయ ప్రమేయానికి ఎక్కువ అవకాశం కల్పిస్తూ ప్రజా ఆస్తులకు రక్షణ కొరవడేలా రెవెన్యూ యంత్రంగా కనుసన్నలలో వ్యవహారాలు సాగేలా కోర్టుల పరిధిని నిరోధించే అనుకూల దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం చీకటి జిఒ ద్వారా రాష్ట్రంలో భూ హక్కుల చట్టాన్ని తెరమీదకు తెచ్చిందన్నారు. ఇటువంటి చర్యల ద్వారా ప్రజలు భవిష్యత్‌లో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. అధికారం అడ్డం పెట్టుకుని హుకుం చేసేవారిదే పైచేయి అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పిస్తున్న కోర్టులు కూడా మౌనంగా ఉండాల్సిన దయనీయ స్థితి ఏర్పడుతుందని అన్నారు. తక్షణమే జిఒ 512ను ఉపసంహరించుకుని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.సోమశేఖర్, ఎస్.ఎల్.నారాయణ, ఎన్.రమణయ్య, గిన్ని సీతయ్య, ఎం.కె.సామంత్ పాల్గొన్నారు.



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న రామ్మోహన్ నాయుడు, రవికుమార్

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని కొత్తకోటంలో సర్పంచ్ సువరపు జగదీశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ మేరకు వైసిపి నాయకులు కాగితాపల్లి తిరుపతిరావు, తవిటినాయుడు, బాలరామకృష్ణ, డోల బాబా రమేష్‌బాబు ఆధ్వర్యాన వంద కుటుంబాలు టిడిపిలోకి చేశారు. వారికి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైకో సిఎం జగన్ వింత పాలనతో తీవ్రంగా నష్టపోయి గ్రామంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. టిడిపి, జనసేన కలయికతో నారాచంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి నాయకులు శివ్వాల సూర్యం, అంబల్ల రాంబాబు, పల్లి సురేష్, నందివాడ గోవిందరావు పాల్గొన్నారు.

అర్హులైనా.. అందని పరిహారం

ఇంకా 33 కుటుంబాలకు ప్యాకేజీ పెండింగ్

ప్రజాశక్తి- నౌపడ

మూలపేట పోర్టుతో జిల్లా రూపు రేఖలే మారిపోతాయని, మూలన ఉన్న మూలపేట అభివృద్ధికి మూల స్తంభంగా నిలిచిపోతుందని చెబుతూ గతేడాది ఏప్రిల్ 19న సిఎం జగన్మోహన్‌రెడ్డి మూలపేట పోర్టుకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అందుకు తగ్గట్టుగానే పనులు శరవేగంగానే జరుగుతున్నాయి. ఇప్పటికే 1400 మీటర్ల వరకు నార్త్ బ్రేక్ వాటర్ పనులు, 800 మీటర్లు సౌత్ బ్రేక్ వాటర్ పనులు పూర్తి చేశారు. మొదటి దశలో రెండు బెర్త్‌లను సిద్ధం చేసి పోర్టు కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం అప్పగించిన పనిని విశ్వసముద్ర కాంట్రాక్టు సంస్థ యుద్ధప్రాతిపదికన చేపడుతుంది. అందుకు తగ్గట్టుగానే సముద్రతీరంలో సివిల్ వర్కులు, ఫ్లోరింగ్, పోర్టు కార్యాలయాలకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారీ యంత్రాలు సాయంతో డ్రెజ్జింగ్, కాంక్రీట్ పనులు అనుకున్నట్టుగా సాగుతున్నాయి. అంతా బాగానే ఉన్నా పోర్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన పలువురు నిర్వాసితులకు మాత్రం పరిహారం అందజేయకుండా అధికారులు మొండిచేయి చూపిస్తున్నారు. పరిహారం కోసం నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. అయినా అధికారులు మాత్రం రకరకాల షాకులు చెబుతూ పైఅధికారులపై పెట్టి కాలం నెట్టుకొస్తున్నారు. దీంతో ఏం చేయాలో తోచక పలువురు నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోర్టు నిర్మాణ ప్రాంతాలను మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో మొత్తం 594 మందికి నిర్వాసిత కుటుంబ పరిహారం (పిడిఎఫ్)లు గా గుర్తించారు. వీటిలో దాదాపు 95



మూలపేట పోర్టులో బ్రేక్ వాటర్ నిర్మాణం

శాతం వరకు చెల్లింపులు జరిగాయి. అయితే అధికారులు హడావిడిగా రికార్డులు నమోదు చేయడంతో 15 మందికి ఇప్పటికీ పిడిఎఫ్‌లు అందలేదు. మరో 18 మందికి వలసలు, రికార్డు ప్రకారం వయసు తక్కువై మరికొందరికి పిడిఎఫ్ ప్యాకేజీ అందలేదు. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.25 లక్షలు చొప్పున అందజేసి 320 ఎకరాల వరకు సేకరించారు. దీంతో 30 మందికి పైగా భూముల ఇవ్వకపోవడంతో బలవంతంగా తీసుకొని వారి అకౌంట్లకు జమ చేస్తామని అధికారులు చెప్పారు. దానిపై కూడా వారికి అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. ఇందులో పది మందికి నష్టపరిహారం అందించేందుకు అవార్డులు సిద్ధమయ్యాయి. పశువుల శాలలకు రూ. 25,000 నష్ట పరిహారం ఇంకా అందలేదు. ఉద్యాన పంటలైన ఒక్కో జీడి, మామిడి చెట్లకు రూ. 5,000 చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కొంతమందికి మాత్రమే రూ.2150 చెల్లించారు. అరండార్ కాలనీ సిద్ధం చేసి రెండు గ్రామాలు ఖాళీ చేయించాలని ప్రభుత్వం సిద్ధమవుతోంది. వారి ప్రస్తుత ఇళ్ల నిర్మాణం బట్టి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. ఇళ్ల విలువ కట్టే విషయంలో పలువురు నిర్వాసితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి తాము అడడంకి కాదని, తమకు న్యాయంగా రావాల్సిన ప్రతి రూపాయి చెల్లించిన తర్వాతే ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని పలువురు నిర్వాసితులు కోరుతున్నారు.

న్యాయం చేయాలి



మూలపేట, విష్ణు చక్రం గ్రామాల్లో నిర్వాసితులకు చట్ట ప్రకారం రావాల్సిన ప్రతి ఒక పైసా చెల్లించాలి. భూములు, ఇళ్లు, మొక్కలు చెల్లింపులు విషయంలో ఇంకా కొంతమందికి పరిహారం అందలేదు. 30 మందికి పైగా పిడిఎఫ్ ప్యాకేజీల కోసం ఎదురుచూస్తున్నారు. రావాల్సిన పరిహారం కోసం ఆరు నెలలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలి.

- జీరు బాబూరావు, మూలపేట సర్పంచ్

పరిహారం ఎప్పుడు ఇస్తారో తెలియదు

మాది మూలపేట గ్రామం. కుటుంబ అవసరాల రీత్యా బయట గ్రామాలకు వలస వెళ్లాం. అధికారులు రికార్డులు నమోదు చేసే సమయంలో అందుబాటులో లేకపోవడంతో ఇంతవరకు పరిహారం అందలేదు. మాతో పాటుగా గ్రామంలో మరో 35 మందికి పిడిఎఫ్ పరిహారం ఎప్పుడు పడుతుందో తెలియని పరిస్థితి. అధికారులు త్వరగా పిడిఎఫ్ ప్యాకేజీని అందజేయాలి.

- చిదపాన సరస్వతి, మూలపేట

పేస్లిప్‌ల జిఒ ప్రతులు దహనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శ్రీకాకుళం నగరంలోని భోగి మంటల్లో రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామ్య వైఖరి నశించాలని డిమాండ్ చేస్తూ... నిరంకుశ వైఖరి ప్రతులను ఆదివారం వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు హామీలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని అన్నారు. ప్రతి పోరాటంపైనా కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఇబ్బంది పెడుతుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.18 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పిఆర్‌సి విధి విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను మంజూరు చేయాలన్నారు. మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజాస్వామ్యతంగా పోరాటం చేస్తుంటే ఉపాధ్యాయులపై నిర్బంధాలు, అక్రమంగా కేసులు పెడుతూ భయాందోళనలకు గురి చేస్తున్నారని, ఇది సరికాదని అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.వెంకటరావు, కె.సురేష్‌కుమార్, జి.విశ్వనాథం, వరప్రసాదరావు, సంపత్‌కుమార్, రమణమూర్తి, హరనాథ్ పాల్గొన్నారు.



సోంపేట : పేస్లిప్‌లను దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: ఉపాధ్యాయులకు బకాయి పడిన ఆర్థిక వేతనాల మంజూరు కోరుతూ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని అణిచివేయాలన్నా దురుద్దేశంతో జారీ చేసిన జిఒ ప్రతులను యుటిఎఫ్ నాయకులు ఆదివారం భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం మొండి వైఖరి



శ్రీకాకుళం : పేస్లిప్‌ల ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అవలంబించడం సరికాదన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ దహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కురమాన దాలయ్య, పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు, రోనంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సోంపేట: మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. భోగి పండగ నేపథ్యంలో యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వ వ్యతిరేక పేస్లిప్ పేపర్ క్లిప్పింగ్ కాపీలను భోగి మంటల్లో దహనం చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఎస్.కూర్మారావు, జి.దొరబాబు, లోకనాథం, నాగేశ్వరరావు, కాళిదాసు, గోపి, రవికుమార్, ఈశ్వరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.



టెక్కలి : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మూడున్నర తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలో శ్రీహరిపురం గ్రామంలో గురుగుబెల్లి మహాలక్ష్మికి చెందిన మూడున్నర తులాల బంగారం చోరీకి గురైందని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మూడుతులాల పుస్తెలతాడు, అరతులం పుస్తెలను దొంగలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పొలం పనులకు బయటికి వెళ్లిన సమయంలో దొంగతనం జరిగినట్లు మహాలక్ష్మి తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వై. కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.



శంకరరావును సన్మానిస్తున్న పోలీసులు

సిఐకి సన్మానం

వజ్రపుకొత్తూరు: పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వై.మధుసూదనరావు అధ్యక్షతన ఇటీవల బదిలీ అయిన కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శంకరరావు ఆదివారం సన్మానించారు. ఏ ఒక్కరినీ కించపరిచేలా వ్యవహరించ కూడదు అన్నారు. విధులు నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సామరస్యంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోరాయి గోపీకృష్ణ, బొత్స షణ్ముఖరావు, ఎఎస్ఐ జిన్నారావు, పాపారావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జగన్, కోటి పాల్గొన్నారు.

17న రక్తదాన శిబిరం

ఆమదాలవలస : మండలంలో కనుగులవలసలో ఈ నెల 17న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిసిఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, కనుగులవలస మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి రామజోగి నాయుడు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.



సంగమయ్య జాతర జరుగనున్న ప్రదేశం

నేటి నుంచి సంగమయ్య జాతర

ఆమదాలవలస : మండలంలో గాజులకొల్లివలస పంచాయతీ పరిధిలో సంగమయ్య కొండపైన సంగమేశ్వరాలయం ఉంది. కొండ దిగువన ఏటా జరగనున్న సంగమయ్య జాతరకు సర్వం సిద్ధమైంది. ప్రతి సంవత్సరం జనవరి నెలలో మూడు రోజుల పాటు సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజు సంగమయ్య జాతర భారీ ఎత్తున జరుగుతుంది. ఈ యాత్రకు జిల్లా నుంచే కాకుండా విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రం నుంచి పెద్దఎత్తున పాల్గొంటారు.



నగదును అందజేస్తున్న రామూర్తి

చిన్నారులకు ప్రోత్సాహకం

లావేరు : మండలంలో గుమ్మాడం పంచాయతీకి చెందిన టిడిపి నాయకుడు మజ్జి రామ్మూర్తి సంక్రాంతి సంబరాలు సందర్భంగా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, చిన్నారుల ఆటల పోటీలను ప్రోత్సాహిస్తూ తనవంతు సాయంగా రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ముగ్గుల పోటీల్లో పాల్గొని సాంప్రదాయాలను కొనసాగించాలని కోరారు.

ఎటిఎంలో నగదు కొరత

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడ ఎస్‌బిఐ శాఖ చెందిన ఎటిఎం సెంటర్లలో కొరతతో ఖాతాదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వరుసగా బ్యాంకు సెలవులు రావడంతో ఎటిఎంలపై ఆధారపడిన ఖాతాదారులు నగదు రాకపోవడంతో నిట్టూరుస్తూ వెనుదిరుగుతున్నారు. సుమారు వంద గ్రామాలకు పైగా ఆధారపడి ఉన్న ఎటిఎం సెంటర్‌లో నగదు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఖాతాదారులు నుంచి విమర్శలు వస్తున్నాయి. కనీసం నో క్యాష్ బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. పండగ రోజులైనా నగదు లభించకపోవడంపై బ్యాంకు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

పూర్వ విద్యార్థుల సామగ్రి వితరణ



సామగ్రిని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు జిల్లా కేంద్రంలో ప్రశాంతి వృద్ధ జనాశ్రమానికి వస్తు వితరణ చేశారు. 1996-98 సంవత్సరం లో ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అందరూ ఒకేచోట కలిసి జిల్లా కేంద్రంలో ప్రశాంతి అనాథాశ్రమానికి 10 ఫ్యాన్లను ప్రధానం చేశారు. అనంతరం అనాథలకు పళ్లు, దుస్తులకు పంపిణీ చేశారు. అనంతరం జూనియర్ కళాశాల వద్ద పూర్వ విద్యార్థులందరూ సమావేశమై ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తామంతా ఇతర దేశాల్లో స్థిరపడ్డామని, సంక్రాంతి సందర్భంగా తమ సొంత ఊరికి తాము చదువుకున్న కళాశాలకు వచ్చి అందరం ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ కాలేజీ నాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు గొండు తవిటినాయుడు, పేడాడ రామకృష్ణ, కూన విక్రమ్, బలగ శ్రీనివాసరావు, బాలామణి, భారతి, సునీత, శివ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కోరారు. స్థానిక సర్పంచ్ గొండెలి సుజాత అధ్యక్షతన ఎంపిటిసిలతో, సర్పంచ్‌లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజవర్గంలో గత 25 ఏళ్లుగా రాక్షస పాలన కొనసాగుతుందని, ఆ పాలనకు సమరగీతం పాడాలని, జగనన్న పాలనలో అడుగుపెడదామని అన్నారు. ఇప్పటినుంచే



మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రచారం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో చింతాడ గణపతిరావు, ఎంపిటిసిలు పీత హేమలత, కూన పార్వతి, యర్ర అనంతయ్య, వార్డు సభ్యులు నూనెల సోమేశ్వరరావు, వైశ్యరాజు అశోక్, పీత రమణ, వారణాసి గోవిందరావు, బమ్మిడి తులసీరావు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం




శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్‌ను దహనం చేస్తున్న లక్ష్మీదేవి

లావేరు : పల్లె పిలుస్తుంది రా కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. సంక్రాంతికి దేశం నలుమూలల నుంచి స్వగ్రామాలకు వస్తున్న ప్రతి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులు తమగ్రామల్లో ప్రజలకు వైసిపి ప్రభుత్వ అరాచక పాలనపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ జోన్-1 ఇన్‌ఛార్జి ఆవాల సతీష్ కుమార్, కాకర్ల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి మురళీ, మజ్జి రామూర్తి, రమేష్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : గడచిన నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్థమైందని, అభివృద్ధి లేక రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిందని, ఈపరిస్థితిని తిరిగి సరిదిద్దాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. ఆదివారం అరసవల్లిలో రా కదలిరా పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బోగి మంటను వేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. నగర టిడిపి బిసి అధ్యక్షులు ఉంగటి రమణ, అరసవిల్లి యూత్ కునుకు గోవింద, టిడిపి నాయకులు ఉంగటి పాపారావు, ఉంగటి రామ్మోహన్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేత కాశీబుగ్గ

సోంపేట: మండలంలోని చిన్నమామిడిపల్లి మహాసేన యూత్ ఆధ్వర్యాన జరిగిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో కాశీబుగ్గ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. అధ్యక్షుడు కుమార్‌స్వామి ఆధ్వర్యాన జరిగిన ఈ పోటీలకు 60 టీమ్‌లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి కాశీబుగ్గ జెడ్‌పి హైస్కూల్, ద్వితీయ బహుమతి కొత్తపల్లి పాఠశాల, తృతీయ బహుమతి హరిపురం పాఠశాల కైవసం



బహుమతులు అందజేస్తున్న కోదండకృష్ణ

చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలతో బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో దున్న మాధవరావు, శివంగి వాసు, దేవరాజు, కోదండరావు, మురళి గణేష్, త్రినాధ్, రెయ్య కోదండ కృష్ణ పాల్గొన్నారు.



పలాస : కబడ్డీ ఆడుతున్న మహిళలు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని భైరిపురంలో యువజన సంఘాల ఆధ్వర్యాన ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి లమ్మత, సంగీత కైవసం చేసుకోగా, బల్లెడ సహస్ర ద్వితీయ స్థానం, పొడియా సుజాత, మాదిన సంతోషి తృతీయ, చతుర్థి స్థానాలు పొందారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు షీల్డ్ లు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పి.జగదీశ్వరి, పి.జగదీష్, బి.కీర్తిరావు, పి.రామ్‌కుమార్, బి.సృజన్, బి.అప్పారావు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని కొర్లంలో రామ్‌బుడ్డి గంగారావు ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ సాంప్రదాయాలను తెలియచెప్పేలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నమని తెలిపారు. ఏటా యువజన ఉత్సవాల పేరిట సంక్రాంతి సంబరాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్ బుడ్డి గణపతి, జానకిరామ్, రత్నాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కవిటి : బహుమతిని అందుకుంటున్న సంగీత

పలాస : మండలంలోని బొడ్డపాడు, గురుదాసుపురం, నీలావతి, మాకన్నపల్లి, మామిడిమెట్టు పంచాయతీల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు ఆటపాటలతో సందడి చేశారు. గ్రామాల్లో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆటలు ఆడారు. మహిళలు రుమాల్, కుర్చీల ఆటలు ఆడుతూ ఉత్సాహంగా... ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సైని దేశయ్య, తామడ మధన్, సొర్రా తిరుపతిరావు, కుత్తుం లక్ష్మణ్‌కుమార్, పోతనపల్లి బాలరాజు, సున్నాదేవి పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో తూర్పుకాపు గర్జన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దశాబ్దాలు గడుస్తున్నా రాజకీయ ప్రాధాన్యతతో పాటు ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి మొదటి వారంలో తూర్పు గర్జన నగరంలో నిర్వహిస్తున్నట్లు తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం నగరంలో తూర్పుకాపు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు సూరంగి మోహనరావు, డోల జగన్మోహనరావు, శాసపు జోగినాయుడు, ఆనెపు రామకృష్ణ, లుకలాపు రవి, గేదెల శంకరరావు, లంక గాంధీ, లోలుగు వెంకట రాజశేఖర్, ఎం.శంకర్ నారాయణలు మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా తూర్పు కాపు వెనుకబడి ఉందని, జనాభా పరంగా జిల్లాలో అగ్రభాగాన ఉన్నా రాజకీయ ప్రాధాన్యత ఆశించిన స్థాయిలో పొందలేక పోతున్నామన్నారు. గర్జన పేరుతో నిర్వహిస్తున్న ఈసభలో రాజకీయపక్షాలకు సత్తా చాటుతామన్నారు. రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, కురిటి దుర్గారావు, దువ్వ కృష్ణారావు, టంకాల ఆనంద్ పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న సంఘ నాయకులు



శ్రీకాకుళం : దుస్తులను పంపిణీ చేస్తున్న డాక్టర్ సురేష్



పలాస : సరుకులు, దుస్తులను అందజేస్తున్న కృష్ణారావు

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో రణస్థలంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఆర్గనైజేషన్ సెక్రెటరీ, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు పేదలకు కొత్త బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి మజ్జి వెంకట రమణ, వార్డు మెంబర్లు కరిమజ్జి చంద్రినాయుడు, పెద్దింటి చిన్నారావు, లంక రామారావు, కేలం వెంకటరమణ, కరిమజ్జి గోవిందరావు, పిన్నింటి పైడితల్లి నాయుడు, పిన్నింటి రామారావు, పిన్నింటి నీలకంఠం, పిన్నింటి రంగారావు, పిన్నింటి రమణ, పిన్నింటి సత్యారావు, పిన్నింటి కొండలరావు, పిన్నింటి అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత డా బొడ్డేపల్లి సురేష్ ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కనుగులవలస, కొండపేట గ్రామల్లో పేదలకు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చలికాలం చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుండె, ఊపిరితిత్తులు, పక్షవాతంపై పలు సూచనలు చేశారు.

రణస్థలం రూరల్: మండలంలో బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం ఎన్ఇఆర్ క్యాంపస్ వద్ద సంక్రాతి పురష్కరించుకొని పరిసర గ్రామ ప్రజలకు బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు, బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గం కన్వీనర్, స్థానిక సర్పంచ్ నడుకుదిటి రజనీ పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఎన్ఇఆర్ స్కూల్ డైరెక్టర్ ఎన్.తేజబాబు, హిరణ్మయి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మండలంలో వెంకటరావుపేట గ్రామంలో వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట లక్ష్మునాయుడు దంపతులు సంక్రాంతి సందర్భంగా సుమారుగా 100 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలం నౌపడలో స్పందన యువజన సంఘం సభ్యులు సంక్రాంతి సందర్భంగా పేదలకు దుస్తులను, సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు నడిమింటి నాగరాజు, పిలక రాజశేఖర్‌రెడ్డి, లోపింటి జయకృష్ణారెడ్డి, షావుకారి నరసింహారావు, మెరువ కోదండరావు (బుజ్జి), అంధవరపు రమేష్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం 150 మందికి పేదలకు, వృద్ధులకు సర్పంచ్ శైలజ దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటా భోగి పండగ రోజున తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.

సోంపేట: సోంపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు క్రాంతి, రాజు, కృష్ణారావు, సుమన్, పి.వినోద్ పాల్గొన్నారు.

పలాస : పలాస వైశ్య సంఘంలో పలాసకు చెందిన 224 మంది నిరుపేద వైశ్య కుటుంబాలకు రూ.1200 విలువ చేసే దుస్తులు, నిత్యవసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస వైశ్య సంఘం అధ్యక్షులు మల్లా కృష్ణారావు, కార్యదర్శి తంగుడు వైకుంఠరావు, కోశాధికారి పి.వి.సతీష్, వైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మల్లా భాస్కరరావు, మహిళా సంఘం అధ్యక్షులు మల్లా సౌజన్య, యువజన సంఘ అధ్యక్షులు మల్లా గణేష్, డోకి నాగేశ్వరరావు, మల్లా సూర్యనారాయణ గుప్తాలు కోట్ని శశికుమార్, తంగుడు కామేశ్వరరావులు పాల్గొన్నారు.



రణస్థలం రూరల్ : దుస్తులను పంపిణీ చేస్తున్న రజనీ, ఎన్ఇఆర్



రణస్థలం : దుస్తులు పంపిణీ చేస్తున్న భానోజీనాయుడు



సోంపేట : దుప్పట్లను పంపిణీ చేస్తున్న సభ్యులు



కోటబొమ్మాళి : దుస్తులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శైలజ



నౌపడ: సరుకులు అందజేస్తున్న సభ్యులు


ఆమదాలవలస : భవిత పాఠశాలలో వేసిన భోగి మంట


పొందూరు అంబేద్కర్ కూడలిలో వేసి భోగి మంట


లోలుగులో భోగి మంట వేసిన యువత

గ్రామాల్లో భోగి సందడి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం భోగి మంటలతో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. మండలంలో పొందూరు, రాపాక, కోటిపల్లి, విఆర్.గూడెం, దల్లవలస, కింతలి, తోలాపి, కనిమెట్ట, లోలుగు, కృష్ణాపురం, నందివాడ, బురిడికంచరాం, తండ్యాం, మలకాంతో పాటు పలు గ్రామాల్లో వేకువజామున యువత, పెద్దలు, చిన్నారులు పెద్దఎత్తున భోగి మంటలు వేసి సందడి చేశారు. భోగి మంటల్లో నీళ్లు మరగబెట్టి స్నానాలు చేశారు. అలాగే పలు గ్రామాల్లో మేలుకొలుపు సందర్భంగా సేకరించిన బియ్యంతో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రణస్థలం: భోగి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. వేకువజా ము నుంచే వీధుల్లో భోగి మంటలు వేసారు. పశువుల పేడతో చేసిన భోగి పిడకలను మంటల్లో వేస్తూ పిల్లలు, పెద్దలు ఆనందంగా గడిపారు. మండలంలో పలు గ్రామాల్లో భోగి పండుగతో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉదయం గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో గ్రామంలో వీధుల్లో తిరుగుతూ సంక్రాంతి శోభకు మరింత వన్నె తెచ్చారు. పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. వివిధ ప్రాంతాలలో నివసించే వారు సొంత ఊర్లకు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

శ్రీకాకుళం అర్బన్: భోగి పండుగను స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇందిరాప్రసాద్ భోగి మంటను ప్రారంభించారు. అనంతరం నడక సంఘాల సభ్యులంతా సంప్రదాయ రీతిలో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బివి రవిశంకర్, క్లబ్ ప్రతినిధులు కూన వెంకట రమణ మూర్తి, శాసపు జోగి నాయుడు, బి.దేవీప్రసాద్, గోలీ ఉమామహేశ్వరరావు, సంతోష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలో మోణింగి వారి వీధిలో ఉన్న భవిత పాఠశాలలో భోగి పండుగను చిన్నారులు, పెద్దల నడుమ ఘనంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామున నాలుగు గంటలకు సాంప్రదాయ బద్ధంగా భోగి మంటను వేసి సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సారవకోట : సారవకోట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశిన భోగి, సంకల్ప వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ధర్మాన తేజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, వెలమల రాజేందర్ నాయుడు, దుంగ స్వామిబాబు పాల్గొన్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఊడికలపాడు, కోటబొమ్మాళి, దంత, కురుడు, హరిశ్చంద్రపురం, లఖందిడ్డి, గంగరాం, యలమంచిలి, పాకివలస, శ్రీజగన్నాథపురం, నిమ్మాడ, తిలారు తదితర గ్రామాల్లో ఘనంగా భోగి పండగ నిర్వహించారు. అలాగే స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. యాత్రికులు పాల్గొని ముగ్గుల వేసి సందడి చేశారు.


పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

పవన్‌కుమార్‌కు అభినందన

ప్రజాశక్తి- సోంపేట

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) పరీక్షా ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన పలాసపురం విద్యార్థి నామాల పవన్‌కుమార్‌ను శ్రీశయన చైతన్య దీపిక సభ్యులు అభినందనలు తెలియజేశారు. సంస్థ సభ్యులు దేవాడ మోహన్రావు, డి.శ్రీనివాసరావు తదితరులు విద్యార్థి స్వగృహానికి ఆదివారం వెళ్లి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ సాధించిన ఈ విజయం ఎందరో విద్యార్థులకు పూర్తిగా నిలుస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో డి.లక్ష్మీనారాయణ, పి.కామేష్, పి.జానకిరావు, లోకనాతం పాల్గొన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న తహశీల్దార్ సోమేశ్వరరావు

చదువుతో పాటు క్రీడలు అవసరం

మెళియాపుట్టి : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని పాలకొండ తహశీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని బాణాపురం పంచాయతీ ఆవరణలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు శారీరక ఉల్లాసానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దింటి చందరావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొండ

ధాన్యం రైతులపై మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, కావున ప్రభుత్వం వీరిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, పాలకొండ మండలం కన్వీనర్ డి.రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 80 కేజీల బస్తాకు అధికంగా నాలుగు కేజీలు ధాన్యం తీసుకుంటున్నారని, రైస్ మిల్లు యాజమాన్యాల అందరూ సిండికేట్‌గా తయారై రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రైతులు అదనపు కేజీలపై ప్రశ్నిస్తే మీ దిక్కున్నచోట చెప్పుకోండి అనే పద్ధతుల్లో యాజమాన్యాలు ఉన్నారని, అధికార యంత్రాంగం నిర్లక్ష్యమే వీటికి కారణమని అన్నారు. ఆర్‌బిఐ కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కావున అధికార యంత్రాంగం రైతులకు మద్దతు ధర ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. రవాణా ఛార్జీలు, కళాసీ కూలీలు రైతులకు రావడంలేదని తెలిపారు. కావున అధికారులు ధాన్యం కొనుగోలుపై దృష్టి సారించి మిల్లర్ల దోపిడీ అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వాజీ చానల్ ఆధ్వర్యాన నిర్వహించిన రంగోలీ, మెగా హౌసీ లక్కీ డ్రా విజేతలకు ఆదివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో బహుమతులు ప్రదానం చేశారు. వాజీ చానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విజేతలకు బహుమతులు అందించారు. మహిళలలో ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీయడమే కాక, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించేలా కృషి చేస్తున్న శ్రీనివాసరావును డిప్యూటీ మేయర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి గుండమ్మ కథ సీరియల్ ఫేమ్ పూజ మూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె.ఎ.నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

నందిగాం: మండలంలోని లఖిదాసుపురానికి చెందిన నర్సిపురం సోమేశ్వరరావు పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నందిగా ఉన్నత పాఠశాలలో 1996-97 పదో తరగతి చదువుకున్న తోటి విద్యార్థులు రూ.20 వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాదిన జయంతిరావు, సనపల గోపాలరావు, బొంగి సుశీల, జిణగ షణ్ముఖరావు, కోనారి ప్రభాకరరావు, బల్ల శ్రీనివాసరావు, నర్సిపురం ఉమారావు, సీమ భాస్కరరావు, తాడి వెంకటరావు పాల్గొన్నారు


నందిగాం : ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బూర్జ : తమతో పాటు చదువుకున్న బాల్య మిత్రునికి ఆదుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఒకటయ్యారు. మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్ స్కూల్ 1998లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో సూరి పుండ్రీకాక్షయ్య అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు రూ.50 వేలు నగదు అందజేశారు. వ్యాపారి వెంకటేష్, డోల అచ్యుతరావు, పిసిని భాస్కరరావు, వెంకటరమణ, నారాయణరావు పాల్గొన్నారు.


బూర్జ : నగదును అందజేస్తున్న స్నేహితులు

మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ప్రధాన రహదారిలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా ప్రజలు సరకులను కొనుగోలు చేయడానికి మార్కెట్‌కు చేరుకోవడంతో రహదారులు కిటకిటలాడాయి. స్థానిక రైల్వేస్టేషన్ నుంచి వన్వే జంక్షన్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపుల వర్తకులు సంక్రాంతికి సంబంధించిన పూజసామాగ్రి, ఇతర సామాన్లు తోపుడుబండ్లు దుకాణాలు వేయటంతో ప్రజలు నడవడానికి కూడా అవకాశం లేకుండాపోయింది. స్థానిక పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోనికి రావాల్సిన వాహనాలను వన్‌వే జంక్షన్ నుంచి దారి మళ్లించి ప్రజలకు, వ్యాపారస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు వివిధ రైళ్ల ద్వారా రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి సరుకులు, కొత్త దుస్తులు కొనుగోలుకు భారీస్థాయిలో ప్రజలు పట్టణానికి చేరుకోవడంతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసిన జన సందోహంతో సంక్రాంతి శోభ కనిపించింది.


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి


ముగ్గులు వేస్తున్న మహిళలు

శివానందగిరి ఉత్సవాలు ప్రారంభం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో బెల్లుపడ వద్ద ఉన్న శివానంద గిరిపై మూడు రోజుల పాటు జరిగే కనుమ ఉత్సవాల ఘనంగ ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం కొండపై ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతి పండగకు ఇచ్ఛాపురం వచ్చిన బంధువులు సమీప గ్రామాల నుంచి కనుమ ఉత్సవాల తిలకించేందుకు భారీగా తరలివచ్చారు. అత్యంత ఘనంగ జరిగే ఈ ఉత్సవాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కమిటీ గట్టి చర్యలు తీసుకుంది. వాహనాల్లో వచ్చే వారికి ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముగింపు సందర్భంగా బహుమతులు అందజేశారు.

బ్యాడ్మింటన్ విజేతలకు నగదు బహుమతి


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న యువజన సంఘం నాయకులు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం దాసరిపేటలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర జిల్లాల మెన్స్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గెలుపొం దిన జట్టుకు మొదటి బహుమతి తనవంతుగా రూ.10 వేలును స్థానిక ఎమ్మెల్యే పి.పుష్ప- శ్రీవాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు బహూకరించారు. ఆర్థికసాయం అందజేసిన ఎమ్మెల్యే దంపతులకు దాసరిపేట యూత్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేడు 'పిఎం జన్‌మన్'పై ముఖాముఖి

విజయనగరం : కేంద్ర ప్రభుత్వం పివిటిజిల కోసం ప్రారంభించిన పిఎం జన్‌మన్ కార్యక్రమం అమలుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం.. గిరిజనులతో ఆన్‌లైన్ ద్వారా ముఖాముఖిలో పాల్గొంటున్నారు. దేశంలో ఎనిమిది జిల్లాలకు చెందిన పివిటిజి గిరిజనులతో ప్రధానమంత్రి ముఖాముఖి నిర్వహిస్తారని, జిల్లాలో గంట్యాడ మండలం డెప్పూరు గిరిజన గ్రామంలో ప్రత్యక్ష ప్రసారం వీక్షించే ఏర్పాట్లు చేశామని గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖర్‌రావు చెప్పారు.